"యేడిశావు !" అంది వసంత నవ్వు తెచ్చిపెట్టు కుంటూ. క్షణం క్రితం బంగారురంగులలో మెరుస్తున్న వసంత మొహం ఈ వార్త వినగానే యెఱ్ఱ కలువలా అయిపోయింది.

"బేగిరండి మరి! బామ్మగారు యిప్పటికే కోపం సేస్తు న్నారు. మీరు సుమిత్రమ్మగారింటికి వెళ్తున్నానని సెప్పి రంట గదా – రండి, రండి!" వెంకన్న తొందర చేశాడు.

"అట్లా చూస్తావేం! నిలువు గుడ్లేసుకునీ? పద, నన్ను శేపు దొంగని చేద్దువుగానిలే!" నవ్వుతూ అంది సుమిత్ర. అందరూ కదిలి గుంపుగా యింటివైపు బైల్దేరారు.

"అల్లుడుగారు యీాది వరండాలో కూసున్నారు. దొడ్లోనుంచి పదండి!" వెనకనుంచి వసున్న వెంకన్న వీధి గుమ్మంలో నుంచి రావటానికి వస్తున్న వాళ్ళని హెచ్చరిం చాడు.

"పోవోయ్! మా కేమిటి భయం? మేం యిటే వస్తాం!" విమల ధైర్యంగా దారితీసింది. శ్రీధర్‌ని చూడాలనే ఆసక్తితో వున్న వాళ్ళంతా అనుకరించారు. అందరితో పాటు వసంత గూడా నడిచింది.

వరండాలో పరంధామయ్యగారి ప్రక్కనున్న వాలు కూర్చీలో వెనక్కు వాలి పడుకుని వున్నాడు శ్రీధర్. గాజుల గలగలలతో, కిలకిల నవ్వులతో, సన్నటి గుసగుసలతో లోపలికి వస్తున్న అమ్మాయిల్ని చూసి–అందులో మధ్యగా వున్న వసంతని గుర్తుపట్టి అతను తనకు తెలియకుండానే ఆశక్తితో లేచి కూర్చున్నాడు. అంతవరకూ అల్లుడితో యేదో మాట్లా డ్తున్న పరంధామయ్యగారు వీళ్ళను చూసీ చూడటంతోనే

ముఖం యింత చేసుకుని "యెక్కడ్నుంచి మీరాక? పొండి-పొండి. లోపలికి పొండి.! యింత పొద్దు పోయే దాకా పెత్తనాలు సాగించుకొస్తున్నారా?" అని కసిరాడు.

క్షణంలో సగం సేపు శ్రీధర్‌తో చూపులు కలిపిన వసంత ఒక్కంగలో అందరికంటె ముందు యింట్లోకిపోయింది.

"ఒరే వెంకా! గంగాళంలోకి వేడినీళ్ళు తోడావా? ఇదుగో సుబ్బులూ! ఆ గిన్నెలు కడిగి ముందు యిక్కడ బోర్లించు" వంట యింట్లోంచి బామ్మగారి కంఠం ఖంగుమని విన్పిస్తోంది. యేదో పనిమీద హడావుడిగా దొడ్లోకి వెళ్ళబోతున్న ఆవిడ అమ్మాయిల బృందాన్ని చూసి హఠాత్తుగా ఆగిపోతూ "యేవి, వసంత వచ్చిందా? అలా పెళ్ళినడకలు నడుస్తావేం? చప్పున వెళ్ళి స్నానంచేసి బట్టలు మార్చుకురా! ఆ జడ-ఆ రేగిపోయిన జుట్టు - ఆ వెలిసి పోయిన పరికిణీ నువ్వూ-యీ వాలకంతోనే అతని ముందునుంచి వచ్చావా? వెళ్ళు-యింకా చూస్తావేం? స్నానం చేసిరా! ఇదుగో చూడమ్మా సుమిత్రా! కాసిని యీ సన్నజాజులన్నీ చక్కగా పెద్దగా మాలకట్టు- రాధమ్మ తల్లీ! నువ్వొచ్చావూ? నీ కోసమే కబురుపంపుదా మనుకుంటున్నానే తల్లీ! కాస్త లక్ష్మీ, నువ్వూ అంతాకలిసి ఆ గది కొంచెం సర్ది పెట్టండి! అగరొత్తులవీ పంపిస్తాను. మాతల్లి-మాతల్లి కాస్తసాయం చేసి పెట్టండి! మీ వసంత మొగుడు సామాన్యుడు కాదయ్యో మరి! చూడు, హఠాత్తుగా వచ్చి యెలా హడావుడి పెట్టున్నాడో!" ఒక్క-గుక్కలో - జి. టి. ఎక్స్‌ప్రెస్ స్పీడ్‌లో బామ్మగారు పనులు పురమాయించి చేసి వెళ్ళిపోయారు.

